సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 30 । ఆగస్టు । 2025



హడలెత్తిస్తున్న గంజాయి బ్యాచ్

ఏలూరు మార్కెట్ యార్డ్ పరిసరాల్లో గంజాయి బ్యాచ్ హడలెత్తిస్తోంది. గంజాయి తాగి ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. 8లో ▸



కనికరించరా !

కళ్ల ముందు వైకల్యం స్పష్టంగా కనిపిస్తున్నా పింఛన్ల రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగులతో ఆడుకుంటోంది. 8లో ▸



విద్యుత్‌తో జాగ్రత్త

వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్ఈ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు రౌండ్ టేబుల్ సమావేశం



భీమవరం: భీమవరం నుంచి కలెక్టరేట్ తరలింపు ప్రయత్నాలకు వ్యతిరేకంగా శనివారం అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వెంకటరాయుడు పిలుపునిచ్చారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వేలాది మంది విద్యార్థులు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వంటి పలు కోర్సులు చదువుతున్నారని, సకాలంలో ఫీజు నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు చేతికి రాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పీపీ యూనిట్ ఇన్‌చార్జిగా రవిరాజు

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'పైసలిస్తేనే ఆపరేషన్లు' శీర్షికన ఈనెల 26న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వైద్యారోగ్యశాఖ డీఎంహెచ్ఓ డాక్టర్ జి.గీతాబాయి చర్యలు చేపట్టారు. డబ్బులు తీసుకుని ఆపరేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ చేశామన్నారు. పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ చాముండేశ్వరిని ఇరగవరం మండలం రేలంగి పీహెచ్‌సీకి బదిలీ చేశామని, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని లెప్రసీ విభాగ వైద్యాధికారి డాక్టర్ కె.బంగారు రవిరాజును పీపీ యూనిట్ విభాగానికి ఇన్‌చార్జ్‌గా నియమించినట్టు చెప్పారు. 'సాక్షి' కథనాన్ని అనుసరించి చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలను అడ్డుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి జిల్లాస్థాయి కమిటీ ఫర్ బెటర్ కో–ఆర్డినేషన్ ఇన్ కంట్రోలింగ్ గంజాయి–ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ సమావేశాన్ని నిర్వహించారు. గంజాయి సాగు నియంత్రణ, రవాణా, అమ్మకం, వినియోగం, అవగాహన, గంజాయికి బానిసలు అయిన వారికి వైద్య సహాయం, పునరావాసం అంశాలపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి 8 కేసులు నమోదయ్యాయని 33 మందిని అరెస్ట్ చేసి 25.286 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు.

అర్జీల పరిష్కారంపై.. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై సీఎంఓ 1100కు అందిన ఫీడ్ బ్యాక్ నివేదిక అనుసరించి అధికారులతో సమీక్షించారు. అలాగే రోడ్డు భద్రతకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు.

అందుబాటులో ఇసుక

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని 7 నిల్వ కేంద్రాల్లో ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. జిల్లాలో ఇసుక నిల్వలపై సమీక్షించారు.

1న చలో విజయవాడ

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం వచ్చేనెల 1న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు, ఐకాస నాయకులు ఆర్ఎస్ హరనాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగుల ప్రయోజనాలు హరించుకుపోయాయన్నారు. రెండు దశాబ్దాలుగా దీనిని వ్యతిరేకిస్తూ పాత పింఛన్ విధానం అమలు చేయాలంటూ ఉద్యోగ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే 2004కి ముందు ఉద్యోగం పొందిన వారికి కూడా సీపీఎస్ అమలు చేస్తున్నారని, వీరికి కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు.

ప్రదాతపై కూటమి వివక్ష

- ఉద్యాన వర్సిటీ వద్ద వైఎస్సార్ విగ్రహ ఏర్పాటులో తాత్సారం
- రైతు దంపతుల విగ్రహ ఏర్పాటుకు కుట్ర
- కోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి కొట్టు
- నాలుగు వారాలు స్టే విధిస్తూ ఉత్తర్వులు





ఉద్యాన వర్సిటీ ముఖ ద్వారం వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రాంతంలో రైతు దంపతుల విగ్రహాలు, ఉద్యాన వర్సిటీ పాలక భవనం

తాడేపల్లిగూడెం: రైతు బాంధవుడు, అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోంది. ప్రతిష్టాత్మకమైన వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ముఖద్వారంలో యోగ ముద్రలో ఉన్న వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుపై కుట్రలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత పాలక వర్గాలను తోసిరాజని గతంలో వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు గాను నిర్మించిన పెడస్టల్‌పై రైతు దంపతుల విగ్రహాలను ఏర్పాటుచేసింది. దీనిపై మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కేసును స్వీకరించి ఈనెల 19కి వాయిదా వేసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఉద్యాన వర్సిటీని ఆదేశించింది. వాదనల అనంతరం విగ్రహ ప్రతిపాదిత ప్రాంతంలో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, ప్రారంభోత్సవాలు చేయవద్దని నాలుగు వారాల పాటు స్టే విధిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వ్యవహారం వ్యాజ్యం రూపంలో పెండింగ్‌లో ఉంది.

2023లో తీర్మానం

వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పటి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ చొరవతో ఇక్కడ ఉద్యాన వర్సిటీ ఏర్పడింది. గూడెం ప్రాంతంలో కాకుండా ఏలూరు ప్రాంతంలో ఉద్యాన వర్సిటీని ఏర్పాటుచేయాలని అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రయత్నించగా.. ఇక్కడ ఏర్పాటు ఆవశ్యకతపై కొట్టు అంకెలతో వైఎస్సార్‌కు విపులీకరించారు. దీంతో వెంకట్రామన్నగూడెంలో దేశంలో రెండోవదిగా, దక్షిణ భారతదేశంలో మొదటిదిగా ఉద్యాన వర్సిటీ ఖ్యాతి గడించింది. ఇలా ఉద్యాన వర్సిటీ ప్రదాతగా వైఎస్సార్ నిలిచిపోయారు. మహారాష్ట్రకు చెందిన ఆర్కిటెక్ అశోక్ మోఖా ద్వారా డిజైన్లు ఖరారు కావడం, వైఎస్సార్ నిధులు విడుదల చేయడంతో పనులు చకచకా జరిగిపోయాయి. వైఎస్సార్ మరణానంతరం అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని కేబినెట్ ఉద్యాన వర్సిటీ పేరును డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంగా మార్చింది. వర్సిటీ దినదినాభివృద్ధి చెందుతూ సేవలు, పరిశోధనలను విస్తరించింది. ఈ నేపథ్యంలో 2023 ఆగస్టు 10న అప్పటి పాలక వర్గం వర్సిటీ ముఖద్వారం వద్ద యోగముద్రలో ఉన్న వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు తీర్మానం చేసి ఆమోదించింది. వర్సిటీ ముఖద్వారం సమీపంలో సుమారు రూ.7 లక్షలకు పైగా నిధులు వెచ్చించి పెడస్టల్ నిర్మాణం పూర్తి చేసింది.

ఇది సముచితం కాదు: మాజీ మంత్రి కొట్టు

వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన వర్సిటీ ప్రదాతగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చరిత్రలో నిలిచారు. వర్సిటీ ఏర్పాటు ద్వారా ల్యాబ్ టు ల్యాండ్ వరకు పరిశోధన ఫలాలు చేరాయి. ఉద్యాన పంటల ఆధారిత వాణిజ్య ఉత్పత్తులను తయారు చేసే స్థాయికి రైతులు ఎదిగారు. వైఎస్సార్‌కు కృతజ్ఞతగా విగ్రహం ఏర్పాటుకు 2023లో పాలకవర్గం తీర్మానం చేసింది. విగ్రహం ఏర్పాటుకు నమూనాను ప్రఖ్యాత ఆర్కిటెక్, ఉద్యాన భవన నమూనాలు తయారు చేసిన అశోక్ మోఖా ద్వారా తయారు చేయించి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రఖ్యాత శిల్పికి విగ్రహం తయారీ బాధ్యతను అప్పగించాం. విగ్రహ నిర్మాణం పూర్తి కాగా ప్రారంభోత్సవం మాత్రమే మిగిలి ఉంది.



ఇటీవల ముఖద్వారం ఎదుట వైఎస్ విగ్రహ ఏర్పాటు ప్రాంతంలో రైతు దంపతుల బొమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించాను. న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. విగ్రహం ఏర్పాటుచేసే వరకూ వెనుకడుగు వేయం.

తీర్మానం కాపీ ఇవ్వడం కుదరదు

ఉద్యాన వర్సిటీ ముఖద్వారం వద్ద వైఎస్ విగ్రహ ఏర్పాటుకు గాను 2023 ఆగస్టు 10న చేసిన పాలకవర్గ తీర్మానం కాపీ ఇవ్వడం కుదరదు. ఇది సీక్రెట్ డాక్యుమెంటు. ఓపెన్ డాక్యుమెంటు కాదు. ఎవరడిగినా ఇవ్వం. ఆర్టీఏ ద్వారా అడిగినా కూడా ఇవ్వం. హైకోర్టు ఆదేశిస్తే కోర్టుకు సమర్పిస్తాం. ఎవరికైనా తీర్మానం కాపీ కావాలంటే కోర్టు నుంచి తీసుకోండి.

–బి.శ్రీనివాసులు, ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్

వైద్య కళాశాల పనులు ప్రారంభించాలి

వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గోపి



దగ్గులూరులో నిలిచిన వైద్య కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. కళాశాలను భీమవరం తరలిస్తున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో గోపి శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో దగ్గులూరులో 60 ఎకరాల భూమిని సేకరించి రూ.475 కోట్లతో వైద్య కళాశాల పనులు ప్రారంభించారన్నారు. ఇది గిట్టని అప్పటి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పనులు జరగడం లేదని నానా రాద్ధాంతం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా మంత్రి రామానాయుడు ఒక్కసారి కూడా కాలేజీ నిర్మాణం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశాదీపమైన వైద్య కళాశాల ఆయనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిజమైన అభివృద్ధికి ఇటువంటి శాశ్వతమైన పనులు చేయాలని హితవు పలికారు. ఈ ప్రాజెక్టును భీమవరం తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోందని, అదే జరిగితే వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ప్రజా పోరాటం ద్వారా కళాశాల తరలింపు ఆపుతామన్నారు. అవసరమైతే ఆత్మార్పణ చేసైనా ఇక్కడే వైద్య కళాశాల నిర్మాణం జరిగేలా చూస్తామని గోపి స్పష్టం చేశారు.

టెండర్లు పిలవకపోవడంపై మండిపాటు

- రసాభాసగా నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల బైఠాయింపు
- కమిషనర్ తీరును నిరసిస్తూ ఆందోళన



మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా ముగిసింది. చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణతో సహా 14 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వార్డుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు పిలవడం లేదని ఆరోపించారు. అధికార, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మధ్య వాదులాట జరిగింది. చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. సభ్యుల సంతకాల అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, వైఎస్సార్‌సీపీ సభ్యులు బొంతు రాజశేఖర్, కావలి రామసీత, అడిదల శ్యామల, చిట్టూరి పద్మ, జిల్లెళ్ల దిలీప్, ద్వారా గంగాభవానీ, సోమరాజు దుర్గాభవానీ, సిర్రా కాంతమ్మ, పతివాడ పద్మ, మల్లాడి శేషవేణి, సఖినేటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ తదితరులు సమావేశాన్ని అడ్డుకున్నారు. కౌన్సిల్ తీర్మానం జరిగిన పనులకు టెండర్లు ఎందుకు పిలవలేదని కమిషనర్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే ఆ పనులను పరిశీలించి ఓకే చేసిన తర్వాత టెండర్లు పిలుస్తామని కమిషనర్ చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బాయ్‌కట్ చేశారు.

మున్సిపల్ కార్యాలయం బయట ఆందోళన : చైర్‌పర్సన్‌తో సహా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. కమిషనర్ నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ 70 పనులకు కౌన్సిల్ ఆమోదం జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా కమిషనర్ టెండర్లు పిలవడం లేదన్నారు. పట్టణ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని రాజకీయ ఒత్తిళ్లతో కమిషనర్ తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు.

ఉద్యాన వర్సిటీకి జాతీయ స్థాయి ర్యాంకు



వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన వర్సిటీ

తాడేపల్లిగూడెం: ఉన్నత విద్యపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఐఐఆర్ఎఫ్) విశ్వవిద్యాలయాలకు ర్యాంకులను ప్రకటించింది. జాతీయస్థాయిలో ప్రకటించిన ఈ ర్యాంకుల్లో పశ్చిమగోదావరి వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి 29వ ర్యాంకు వచ్చిందని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 2,500కు పైగా సంస్థలను మూల్యాంకనం చేసి ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇందులో 500కు పైగా విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు, 300 బీ స్కూల్స్, బీబీఏ, బీసీఏ కోసం ఉన్న 300 అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలు ఉన్నాయి. ఉద్యాన వర్సిటీ వీసీ కె.గోపాల్ పర్యవేక్షణలో ఆసియన్ పీజీపీఆర్, కాన్సస్ యూనివర్సిటీ, ఆబర్న్ యూనివర్సిటీ, నిట్ తాడేపల్లిగూడెం, మిట్స్ మదనపల్లితో ఎంఓయూలు, వివిధ పరిశోధన సంస్థలు పరిశోధించడం వంటి అంశాల ఆధారంగా ఉద్యాన వర్సిటీకి జాతీయ స్థాయిలో ర్యాంకు వచ్చింది. అవార్డు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

తమ్మిలేరుకు వరద పోటు



ఏలూరులో తమ్మిలేరు ఉధృతి



నాగిరెడ్డిగూడెం వద్ద రిజర్వాయర్ గేట్లు ఎత్తిన దృశ్యం

చింతలపూడి: ఏలూరు జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టు అయిన తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. వర్షాలు కొనసాగుతుండటంతో వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. శుక్రవారం అధికారులు మూడు గేట్లు ఎత్తి 1,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడు దల చేశారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 348.1 అడుగులకు, గోనెలవాగు బేసిన్‌లో 348 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ కె.లాజరుబాబు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 5,000 క్యూసెక్కుల నీరు అంద్రా కాల్వ ద్వార ప్రాజెక్టులోకి వస్తుందన్నారు. డీఈ సీతారాం ప్రాజెక్టు వద్ద మకాం వేశారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

ఏలూరులో చెత్తను తొలగిస్తూ..

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలకు తమ్మిలేరులో నీటి ప్రవాహం పెరిగింది. ఏలూరులోని తూర్పు, పశ్చిమ లాకుల నుంచి దిగువ కొల్లేరులోకి పెద్ద ఎత్తున వరద నీటిని విడుదల చేస్తున్నారు. అయితే లాకుల వద్ద గేట్లు పాడైపోవడంతో గతంలో ఇసుక బస్తాలు వేసి ఉంచారు. షట్టర్‌లు పాడైపోయిన చోట పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు పొక్లెయిన్‌తో చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. షట్టర్‌లు పాడైపోయిన విషయాన్ని గతంలోనే 'సాక్షి' ప్రస్తావించింది. వర్షాకాలంలో పాడైపోయిన షట్టర్లతో సమస్యలు తప్పవని అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన షట్టర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

ముంపులోకి కనకాయలంక కాజ్‌వే



కనకాయలంకలో కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



లైఫ్ జాకెట్స్ లేకుండా పడవలపై కాజ్‌వే దాటుతున్న గ్రామస్తులు

యలమంచిలి: కనకాయలంక ప్రజలకు వరద బెడద వీడడం లేదు. గోదావరిలో వరద పెరగడంతో నెల రోజుల వ్యవధిలో మూడుసార్లు కనకాయలంక కాజ్‌వే వరద ముంపునకు గురయ్యింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 41 అడుగులకు చేరుకోవడంతో కనకాయలంక కాజ్‌వేపై సుమారు మూడడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ఇంజన్ పడవలు ఏర్పాటుచేశారు. కనకాయలంక ప్రజలు పడవలపై కాజ్‌వే దాటుతున్నారు.

రక్షణ చర్యలు శూన్యం

ప్రజల రాకపోకల కోసం పడవలు ఏర్పాటుచేసినా అధికారులు సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఈనెల 21న వరద వచ్చిన సమయంలో కనకాయలంక వచ్చిన జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పడవ దాటే ప్రయాణికులందరికీ లైఫ్ జాకెట్లు ఇవ్వాలని మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు అధికారులు లైఫ్ జాకెట్లు ఏర్పాటుచేశారు. అయినా పడవ దాటే సమయంలో ప్రయాణికులకు ఇవ్వడంలేదు. దీంతో ప్రమాదభరితంగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు



తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో వేడుక

తాడేపల్లిగూడెం (టీఓసీ): గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ పరిపాలన భవనంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి వీసీ డాక్టర్ కె.గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, ఉన్నతాధికారులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో..

తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, డాక్టర్ రాజు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్, జాగ్వార్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ కుమార్, పీడీ డాక్టర్ సత్యనారాయణ, కోర్సు కో–ఆర్డినేటర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో... ఏపీ నిట్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీన్ స్టూడెంట్స్, వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు హాజరయ్యారు. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడారు. పరిపాలన భవనం నుంచి నిట్ తూర్పు ముఖద్వారం వరకు నడక కార్యక్రమాన్ని చేపట్టారు. సంధ్యారాణి, సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజీబీఎస్' ఆస్తులు రక్షించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

నరసాపురం: నరసాపురంలో బీజీబీఎస్ మహిళా కళాశాల ఆస్తుల పరిరక్షణకు, అధ్యాపకుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు తదితర సమస్యలపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక మహిళా కళాశాల ఆస్తుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత కోసం 63 రోజులుగా దీక్ష చేస్తున్న అధ్యాపకుల శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. అధ్యాపకుల సమస్యలు తెలుసుకున్నారు. పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి ఆశయాలను తుంగలో తొక్కుతూ యాజమాన్యం వ్యవహరించటం తగదన్నారు. దాతలు ఇచ్చిన ఆస్తులను అన్యాక్రాంతం చేయటం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, కాలేజీ కమిటీ సభ్యుడు బిల్లు బ్రదర్స్, అధ్యాపకులు పిల్లి ఝాన్సీ లక్ష్మి, వీరవల్లి గంగాలక్ష్మి, పోలేటి భవాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి పథకాలకు రూ.10.02 లక్షల విరాళం



దాత పద్మలత పరమేశ్వరన్‌కు విరాళం బాండ్‌ను అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకాలకు ఒక భక్తుడు శుక్రవారం రూ. 10,02,232లు విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన పద్మలత పరమేశ్వరన్ నిత్యాన్నదాన పథకానికి రూ. 5,01,116, గోసంరక్షణ పథకానికి మరో రూ. 5,01,116 లు కార్తీక్ పద్మనాభన్ పేరున నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ కె.కిషోర్ విరాళం బాండ్‌లను అందజేశారు. దాత అంతక ముందు సతీ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు.

7న ద్వారకాతిరుమలలో శ్రీవారి ఆలయం మూసివేత

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని చంద్ర గ్రహణం సందర్భంగా సెప్టెంబర్ 7న మహా నివేదన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మూసివేస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. మరుసటి రోజు 8న పుణ్యాహవాచనం అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. 7న సాయంత్రం జరగాల్సిన ఆర్జిత సేవలను, అలాగే 8న తెల్లవారుజామున జరగాల్సిన సుప్రభాత సేవను రద్దు చేస్తామని, మిగిలిన అన్ని సేవలు యథావిధిగా జరుగుతాయన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు నజరానా



కప్ అందుకున్న ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా బాస్కెట్ బాల్ బాలికల జట్టు రూ.1 లక్ష నగదు బహుమతి అందుకుంది. జాతీయ క్రీడల దినోత్సవం పురస్కరించుకుని అమరావతి చాంపియన్స్ పేరుతో శాప్ గతవారం నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలో జిల్లా బాలికల జట్టు సభ్యులకు నిర్వాహకులు కప్‌తో పాటు నగదు బహుమతి అందజేశారని కోచ్ మురళీకృష్ణ చెప్పారు.

వైకల్యం కనిపించినా కనికరించరా!



వంద శాతం వైకల్యం ఉన్నా రూ.6 వేలే..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించి వారి ఉసురు పోసుకుంటున్నారు. కళ్ల ముందు వైకల్యం స్పష్టంగా కనిపిస్తున్నా రీ వెరిఫికేషన్ అంటూ ఈ అభాగ్యులతో ఆడుకుంటున్నారు. ఒకరి సహాయం లేనిదే కదలలేని పరిస్థితుల్లో ఉన్న వీరు జిల్లా నలుమూలల నుంచి శుక్రవారం ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి యాతన అనుభవించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఏలూరు జీజీహెచ్‌లో తోసెన్ల కోసం గుమిగూడిన బాధితులు



నిలబడలేక కూర్చున్న దివ్యాంగురాలు



తన వంతు కోసం ఎదురుచూపులు



ఇలాంటి కన్నీటి చిత్రాలెన్నో..



బిడ్డతో పడిగాపులు

నగదు చోరీ కేసులో ఏడుగురి అరెస్టు

నకిరేకల్ (నల్లగొండ జిల్లా): బ్యాంక్‌లో డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యక్తి నుంచి రూ.2.50 లక్షలు దొంగిలించిన ఏడుగురిని నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడిస్తూ.. నకిరేకల్ మండలం నడిగూడెంకు చెందిన మాద నాగరాజు గోల్డ్ లోన్ చెల్లించేందుకు రూ.3 లక్షలు కవర్‌లో పెట్టుకుని ఈ నెల 25న నకిరేకల్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు వచ్చాడు. గుర్తు తెలియని నలుగురు మహిళలు బ్యాంక్‌లోకి వచ్చి నాగరాజు దృష్టి మళ్లించి వెనకాల నుంచి అతని చేతిలోని కవర్‌ను బ్లేడ్‌తో కట్ చేశారు. అందులో ఉన్న రూ.2.50 లక్షలు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి నకిరేకల్ శివారులోని వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఏడుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా.. వారిని ఆపి విచారించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నాగరాజు నుంచి నగదు చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరి నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు, బ్లేడ్, రూ.2.32 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో తాడేపల్లిగూడెంకు చెందిన పురుపు రెడ్డి, పట్నాల పోలమ్మ, పోదుపు రెడ్డి, యరసాని సంధ్య, మేపి పరుపురెడ్డితో మరో ఇద్దరు బాలురు ఉన్నారు.

హడలెత్తిస్తున్న గంజాయి బ్యాచ్



రోడ్డుపై ఫ్లెక్సీలు కోసిన గంజాయి బ్యాచ్



బ్లేడుతో కోసిన బైక్ సీట్లు

ఏలూరు రూరల్: ఏలూరు మార్కెట్ యార్డ్ పరిసరాల్లో గంజాయి బ్యాచ్ హడలెత్తిస్తోంది. గంజాయి తాగి ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలికలను వేధిస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. చీకటి పడితే మహిళలు రోడ్డుపైకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ప్రశ్నించే వారిపై దాడులకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. దీంతో వీరిపై ఫిర్యాదు చేసేందుకు స్థానికులు వెనకంజ వేస్తున్నారు.

యార్డ్ సమీపంలో రోడ్డు పక్కన హోటల్, కిరాణ కొట్లు పరిసరాల్లో గంజాయి బ్యాచ్ తిష్ట వేసింది. ఉదయం 11 గంటలు, సాయంత్రం 6 గంటల తర్వాత గంజాయి తాగిన కుర్రాళ్ళు ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. రెండు రోజుల క్రితం మత్తులో తూలుతూ కత్తులు పట్టుకుని రోడ్డుపక్క కట్టిన ఫ్లెక్సీలు కోశారు. ఇదే క్రమంలో రోడ్డు పక్క షాపుల వద్ద నిలిపిన బైక్ సీట్లు సైతం కోశారు. ఇదేమని ప్రశ్నించిన ఒక వ్యక్తిని కత్తి చూపి బెదిరించారు. గంజాయి తాగిన మత్తులో వారిలో వారు ఘర్షణ పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

సైకిల్ ఆపుతున్నారు

నేను రోజూ సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లి వస్తున్నాను. ఒకరోజు రోడ్డుకు అడ్డుగా నిలబడి నా సైకిల్ పట్టుకుని ఆపారు. సైకిల్ నాది.. ఇస్తావా అంటున్నారు. మీ ఇల్లు ఎక్కడ, ఏ స్కూల్‌లో చదువుతున్నావు.. ఫోన్ నెంబర్ ఇస్తే సైకిల్ వదులుతా అంటూ వేధిస్తున్నారు.

– జి.దివ్య, ఏలూరు

ప్రశ్నించానని సీటు కోశారు

కిరాణకొట్టు దగ్గర బైక్ ఆపి సిగిరెట్ కొంటున్నాను. ఒక కుర్రాడు ఫుల్‌గా తాగి వచ్చి తుళ్ళుతూ నాపై పడ్డాడు. నేను పక్కకు తప్పుకున్నా. బండి పట్టుకుని ఆపేశాడు. ఎందుకు పట్టుకున్నావ్ అంటూ ప్రశ్నించానని, బ్లేడుతో నా సీటు కోసేసాడు.

– కె.రాజేష్, వాహన చోదకుడు

పాల ఉత్పత్తుల్లో కల్తీపై అప్రమత్తం

జంగారెడ్డిగూడెం: పాల ఉత్పత్తుల్లో కల్తీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పాల ఉత్పత్తుల్లో ఇతర పదార్థాలను చేర్చడంతో వాటి స్వచ్ఛత తెలియక ప్రజలు వినియోగిస్తున్నారు. సోడియం బై కార్బనేట్, గ్లూకోజ్, పంచదార, పిండి, యూరియా, బోరిక్ ఆమ్లం, డాల్డా, వంటివి పాలు, పాల పదార్థాల్లో కలిపి కల్తీ చేస్తున్నారు. పాల కల్తీపై పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ పలు అంశాలు వివరించారు.

పాలు, పాల ఉత్పత్తుల్లో కల్తీని గుర్తించడం ఎలా?

సోడియం బైకార్బనేట్: పాలలో సోడియం బైకార్బనేట్‌ను గుర్తించేందుకు టెస్ట్ ట్యూబ్‌లో సుమారు 3 మి.లీ పాలు తీసుకుని దానిలో 10 చుక్కల రోసాలిక్ ఆమ్లం వేయాలి. మిశ్రమం గులాబీ రంగులోకి మారితే పాలల్లో సోడియం బై కార్బనేట్ కల్తీ జరిగినట్లు గుర్తించాలి.

గ్లూకోజ్ : పాలలో గ్లూకోజ్‌ను గుర్తించేందుకు 5 మి.లీ పాల శాంపిల్‌ను టెస్ట్‌ట్యూబ్‌లో తీసుకుని దానిలో డయాస్టిక్స్ పట్టిని అరనిమిషం సేపు ముంచి ఉంచాలి. నీలం రంగులోని ఆ పట్టీ ఆకు పచ్చ రంగులోకి మారితే పాలలో గ్లూకోజ్ కలిపినట్లుగా గుర్తించవచ్చు.

పంచదార: 3 మి.లీ పాల శాంపిల్‌ను టెస్ట్ ట్యూబ్‌లో తీసుకుని దానికి 2 మి.లీ హైడ్రో క్లోరిక్ ఆమ్లం కలపాలి. ఈ మిశ్రమానికి 50 మి.గ్రా రిసార్సినాల్‌ను కలిపి వేడి చేయాలి. పాలలో కలిసిపోతే ఈ మిశ్రమం ఎరుపు రంగులోకి మారుతుంది. దీంతో పంచదార కలిపినట్లుగా గుర్తించవచ్చు.

పిండి : 3 మి.లీ పాల శాంపిల్ టెస్ట్ ట్యూబ్‌లోకి తీసుకుని 1 శాతం నీరు కలిసిన అయోడిన్ ద్రావణం ఒక చుక్క వేయాలి. మిశ్రమం నీలి రంగులోకి మారితే పాలలో పిండి కల్తీ జరిగినట్లుగా గుర్తించాలి.

యూరియా : టెస్ట్ ట్యూబ్‌లో 5 ఎంఎల్ పాల శాంపిల్‌ను తీసుకుని దానికి సోయాబీన్ పొడి లేదా కందిపప్పు పొడిని కలపాలి. మిశ్రమం బాగా కలిపి, 5 నిమిషాల తరువాత ఎర్ర లిట్మస్ కాగితాన్ని మిశ్రమంలో ముంచి 30 సెకన్ల తరువాత బయటకు తీస్తే ఆ కాగితం నీలిరంగుకి మారితే పాలలో యూరియా కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు.

బోరిక్ ఆమ్లం: టెస్ట్ ట్యూబ్‌లో 3 మి.లీ పాల శాంపిల్ తీసుకుని దానిలో 20 చుక్కల హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలపాలి. పసుపు రంగు కాగితపు పట్టిని అందులో ముంచి తీసి మళ్లీ ఒక నిమిషం తరువాత ముంచాలి. మొదటి సారి ముంచినప్పుడు కాగితం ఎరుపు రంగులోకి, రెండో సారి ఒక చుక్క అమ్మోనియా కలిపితే ఆకుపచ్చ రంగులోకి మారితే బోరిక్ ఆమ్లం కలిసినట్లు నిర్ధారించవచ్చు.

డాల్డా : పాలలో డాల్డా కల్తీకి సంబంధించి 3 మి.లీ పాలను తీసుకుని 10 చుక్కల హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేదా మ్యూర్యాటిక్ ఆమ్లం కలపాలి. ఈ మిశ్రమంలో పావు స్పూన్ పంచదార కలిపి 5 నిమిషాలు ఉండాలి. దీంతో ఈ మిశ్రమం ఎరుపు రంగులోకి మారుతుంది. అలా మారితే పాలలో డాల్డా కల్తీ జరిగినట్లు గుర్తించవచ్చు. పెరుగులో డాల్డా కల్తీకి సంబంధించి 5 మి.లీ పెరుగును తీసుకుని 10 చుక్కల హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేదా మ్యూర్యాటిక్ ఆమ్లం కలపాలి. 5 నిమిషాల తరువాత మిశ్రం ఎరుపు రంగులోకి మారితే పెరుగులో డాల్డా కల్తీ జరిగినట్లు గుర్తించవచ్చు. నెయ్యిలో డాల్డా కల్తీ గుర్తించేందుకు 3 మి.లీల శాంపిల్‌ను తీసుకుని 10 చుక్కల హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేదా మ్యూర్యాటిక్ ఆమ్లం కలిపి, ఆ మిశ్రమంలో పావు స్పూన్ పంచదార కలియబెట్టాలి. 5 నిమిషాల తరువాత మిశ్రం ఎరుపు రంగులోకి మారితే నెయ్యిలో డాల్డా కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు.





పాలలో జరిగే కల్తీని పరీక్ష ద్వారా ప్రదర్శిస్తున్న దృశ్యం, పాలలో సోడియం బైకార్బనేట్ కల్తీపై పరీక్ష



బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

మండపాల వద్ద విద్యుత్‌తో జాగ్రత్త

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఏలూరు సర్కిల్ ఎస్‌ఈ పీ సాల్మన్ రాజు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ ఆదేశాల మేరకు ప్రజలకు, భక్తులకు, మండప నిర్వాహకులకు విద్యుత్ భద్రతా సూచనలు అందజేస్తున్నామని ఎస్ఈ చెప్పారు. విద్యుత్ శాఖ పేర్కొన్న సూచనలను పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా, ఆనందకరంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గణేష్ మండపాల వద్ద ముఖ్యమైన జాగ్రత్తలు

- తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలి. విద్యుత్ చోరీ ప్రమాదకరం, చట్టవిరుద్ధం.
- విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్లు లేదా నిపుణుల ద్వారా మాత్రమే చేయించాలి.
- తగిన సామర్థ్యం ఉన్న ఫ్యూజ్ వాడాలి. ఓవర్ లోడ్ అయ్యేంత పరికరాలు ఒకే లైన్లో పెట్టకూడదు.
- ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలి. తెగిన వైర్లు, సడలిన జాయింట్లు వాడరాదు.
- ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ ఉండాలి. విద్యుత్ పరికరాలకు సరైన ఎర్తింగ్ ఉండేలా చూడాలి. మల్టీ-ప్లగ్ ఓవర్ లోడింగ్ నివారించాలి.
- విద్యుత్ లైన్లకు, ట్రాన్స్ ఫార్మర్లకు కనీస దూరంలో మండపాలు ఏర్పాటు చేయాలి. బహిరంగ కేబుల్స్ లేదా విద్యుత్ లైన్ల నుంచి సురక్షిత దూరంలో ఉండేలా చూడాలి.
- ఎల్‌ఈడీ లైట్లు వాడాలి. పాత బల్బులు వాడరాదు. లైట్లు, సీరియల్ సెట్ వైర్లు గోడలకు, లోహ వస్తువులకు నేరుగా తగలకుండా అమర్చాలి.
- పిల్లలను మీటర్లు, వైర్ల దగ్గరకి అనుమతించవద్దు. మండపాల్లో ఫ్యాన్లు, లైట్లు వాడేటప్పుడు ఓవర్ లోడ్ చేయకూడదు.
- గణేష్ విగ్రహాలను తరలించేటప్పుడు విద్యుత్ లైన్లకు తగలకుండా జాగ్రత్త వహించాలి.
- ఏపీఈపీడీసీఎల్ హెల్ప్ లైన్ నంబర్ 1912కి అత్యవసర సమయాల్లో సంప్రదించాలి.

ముంపు వేళ ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు ఇలా

తాడేపల్లిగూడెం: ముంపు ఉద్యాన పంటల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకట్రామన్నగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు డాక్టర్ విజయలక్ష్మి కోరారు. ఎక్కువగా ఉన్న నీటిని బయటకు తోడుకోవాలన్నారు. వ్యాధికారక శిలీంద్రాలు, చీడపీడల నిరోధానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

తోటల్లో జాగ్రత్తలు

లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తిరిగి నాటుకోవాలి. పడిపోయిన చెట్ల మొదట్లో మట్టిని పెట్టి నిలబెట్టాలి. వేరు వ్యవస్థను దృఢపర్చుకోవాలి. ఒరిగి పోకుండా కర్రతో ఊతం ఇవ్వాలి. అధిక తేమ ఉన్న నేలను ఆరనివ్వాలి. సరిచేసిన చెట్లు, బాగున్న చెట్లకు కూడా పోషక లోప నివారణ కోసం మందులు పిచికారీ చేసుకోవాలి. రసం పీల్చు పురుగులు, మచ్చలు, తెగుళ్ల నివారణకు సూచించిన మందులను పిచికారీ చేయాలి. కూరగాయల పంటల్లో ఎత్తయిన నారుమళ్లలో నారు వేసుకోవాలి. వంగ, మిరప, టమోట పంటల్లో వేరు కుళ్లు తెగులు రాకుండా బైటాక్స్ కార్బెండిజమ్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పూలతోటల్లో కోతకు సిద్ధంగా ఉన్న పూలను కోసి గాలి తగిలే ప్రాంతంలో ఉంచి, మార్కెట్‌కు పంపుకోవాలి. ఆకు, పూత మీద మచ్చలు వృద్ధి చెందకుండా మందులు వాడాలి.

కొబ్బరి, పామాయిల్, కోకోలో..

కొబ్బరి, పామాయిల్, కోకోలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కొబ్బరి, ఆయిల్ పామ్‌లో మొవ్వ కుళ్లు సోకకుండా మందులు వాడాలి. కోకో కాయ కుళ్లకుండా బైటాక్సు పిచికారీ చేసుకోవాలి. అరటి విషయంలో సిగటోకా ఆకుమచ్చ తెగులు వృద్ధి చెందకుండా ప్రోపికోనజోల్ , దుంప కుళ్లు రాకుండా బ్లీచింగ్ పౌడరు వంటివి చల్లాలి. గెలలు తడిచేలా సూక్ష్మ పోషక మిశ్రమాలను వినియోగించాలి. బత్తాయి, నిమ్మ తోటల్లో నిలిచిన నీటిని తీసివేసి వేరు వ్యవస్థకు ఎండ తగిలేలా చూసుకోవాలి. విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగంలో బోర్డో మిశ్రమం పూయాలి. తోటల్లో కాపు ఉంటే పిందె, పండు రాలకుండా నివారించేందుకు సూచించిన ఎరువులను పిచికారీ చేయాలి. జామలో నీటిని తీసి తేలికగా చెట్టు చుట్టూ తవ్వాలి. చెట్టు మొదళ్ల దగ్గర ఆక్సీక్లోరైడ్ ద్రావణం పోయాలి. బొప్పాయిలో మొక్క మొదళ్ల దగ్గర ఉన్న నీటిని తీసివేయాలి. పండు కుళ్లు నివారణకు మందులను పిచికారీ చేసి తోటలను సంరక్షించుకోవాలి.



మునిగిన అరటి తోటలు



ద్విచక్ర వాహనాల చోరీ కేసులో అరెస్టు



జంగారెడ్డిగూడెం పోలీసుల అదుపులో నిందితుడు

జంగారెడ్డిగూడెం: మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జ్ ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో నిందితుడైన మండలంలోని చల్లవారిగూడెంకు చెందిన బర్ల శ్రీనివాస్‌ను గుర్తించి, అరెస్టు చేసి విచారించారు. అతని వద్ద ఉన్న 5 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని, శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్ విధించినట్లు చెప్పారు.

నేడు మునిపల్లె సాహిత్యంపై సదస్సు

పెనుగొండ: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మునిపల్లె రాజు శతజయంతి పురస్కరించుకొని కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఎస్వీకేపీ కళాశాలలో శనివారం జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ పలువురు ప్రముఖులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రముఖ విమర్శకులు, పాల్గొంటారన్నారు. ఈ జాతీయ సదస్సులో తెలుగు సాహిత్యంపై ఆసక్తి కలిగిన వారందరూ పాల్గొనాలని కోరారు.

నిందితుడిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యను కొట్టిన ఘటనలో భర్తపై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జ్ ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మద్దిపాటి మౌనికను ఆమె భర్త రవివర్మ మద్యం సేవించి నిత్యం కొడుతున్నాడని.. ఈ నేపథ్యంలో శుక్రవారం తీవ్రంగా కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయన్నారు. ఆమె ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పెద్ద చెరువు తూము వరదతో ముంపు



నూజివీడు పట్టణంలోని 32వ వార్డులో ఇంట్లోకి వెళ్లిన వరద నీరు

నూజివీడు: పట్టణంలోని పెద్ద చెరువు తూము నుంచి పెద్ద ఎత్తున వరద రావడంతో 32వ వార్డులోని చర్చి ఏరియాలో పలు ఇళ్లోకి నీరు చేరింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో గృహాల్లోకి నీళ్లు చేరడంతో చెరువు గట్టుకు మళ్లీ గండి పడిందేమోనని ఆందోళన చెందారు. తూముకు ఉండాల్సిన షట్టర్లు గతంలో చెరువు నీటి సంఘం నిర్వాహకులు తీసి పక్కన పెట్టారు. దానిని ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా భారీ వర్షం పడుతుండటంతో చెరువు తూముకు గడ్డి కట్ట అడ్డుగా పెట్టి తూము కట్టినప్పటికీ వరద ఉధృతికి అది కొట్టుకుపోవడంతో నీరు ఇళ్లను చుట్టుముట్టింది. రోడ్లపై నుంచి ప్రవహిస్తూ వరి పొలాలను సైతం ముంచెత్తింది. కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేయగా.. ఏఈ వచ్చి పరిశీలించి నీరు గృహాల వైపుకు వెళ్లకుండా మళ్లించారు. ఇరిగేషన్ అధికారులు తూము వద్ద చెరువు లోపల ఇసుక బస్తాలతో రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేయించి వరదనీరు తూములోకి రాకుండా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

గణనాథుడి నిమజ్జనం



మండపాకలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక గ్రామంలోని కోదండ రామాలయంలో నిర్వహించిన వినాయకచవితి పూజాధికాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పూజాధికాలు నిర్వహించిన గణనాథుడిని ప్రత్యేక వాహనంలో ఆశీనులు చేసి భారీ ఊరేగింపుగా గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులను ఆదరించాలి



దివ్యాంగుల పిల్లలతో దాతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగుల పిల్లలకు అన్నదానం, ఇతర సేవ కార్యక్రమాలు చేశారు. మనోజ్ కుటుంబ సభ్యులు సహకరించారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను నార్మల్ పిల్లలతో సమానంగా ఆదరించాలని, విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. సత్యనారాయణ, రత్నకుమారి, రజిని, నాగరాజు, లక్ష్మి, కృష్ణ చైతన్య, బాలాజీ రమేష్, శిరీష, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయండి



సీపీఎస్ ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అత్తిలి: సెప్టెంబరు 1న విజయవాడలో జరిగే సీపీఎస్ ఉద్యోగుల మహా సభ పోస్టర్‌ను శుక్రవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అత్తిలి బాలికల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. సీపీఎస్ అంతం– ఉద్యోగుల పంతం అంటూ నినాదాలు చేశారు. ఏపీ సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ హక్కుకోసం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. సెప్టెంబరు 1న జరిగే చలో విజయవాడ సీపీఎస్ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి టి గణపతి, పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్ జి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీలకు కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో తిట్టడం, కించపరిచే విధంగా ప్రవర్తించడం సరికాదని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పెంటపాడు మండలంలోని అల్లంపురంలో మండల తహసిల్దార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. హాజరైన అధికారులు స్థానికులకు వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి గొల్లేరు మోహన్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. సేవా సమితి ప్రతినిధులు పటాన్ వలీ, గొల్లేరు మోహన్, ఉండ్రాజవరపు భాస్కరరావు, గాంధీ మండప అభివృద్ధి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దుర్గారామచంద్రరావు, పోలిశెట్టి రంగారావు, బచ్చు దినేష్, ఎస్‌కే.భాష, పటాన్ సుభానీ, కొప్పుల దుర్గాప్రసాద్, గంధం సుబ్బారావు, ఆగడాల చింతరావు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న కుర్రకారు

- ద్విచక్రవాహనాలపై హల్‌చల్ చేస్తున్న వైనం
- వాహనాలు ఢీకొట్టడంతో ఆస్పత్రులపాలవుతున్న ప్రజానీకం
- పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్
- నంబరు లేని వాహనాలతో రైడ్‌లు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో నంబరు లేనిద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న యువకులు

తణుకు అర్బన్: తణుకు పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనాలపై కుర్రకారు చేస్తున్న హల్‌చల్‌కు ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. కంటి రెప్పపాటులో పక్క నుంచి సర్రున దూసుకెళ్తున్న వాహనాల తాకిడికి వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నంబరు బోర్డులు లేని ద్విచక్ర వాహనాలపై ముగ్గురేసి చొప్పున ప్రయాణిస్తూ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులపైకి దూసుకెళ్తున్న తీరు ఆందోళన కలిగిస్తుందని వృద్ధులు చెబుతున్నారు. బాంబులు పేలుతున్నట్లుగా వచ్చే శబ్దాలకు తోడు పాము మెలికలతో నడుపుతున్న వైనాన్ని ప్రయాణికులు గమనించేలోపే ప్రమాదాల్లో పడిపోతున్నామని వాపోతున్నారు. రహదారుల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేసే సమయంలో సడెన్‌గా వెనక్కి వెళ్లిపోతూ పోలీసుల కళ్లకు దొరక్కుండా వీరు రహదారులపై చేస్తున్న రైడ్లు, ఫీట్లు వాహనదారులతో పాటు పాదచారులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చెబుతున్నారు. దూసుకెళ్తున్న వాహనాలను సైతం పోలీసులు చూసీచూడనట్లుగా వదిలేయడంతో కుర్రకారు మరింతగా రెచ్చిపోయి వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వీరి తాకిడికి చాలా మంది ప్రయాణికులు ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రుల పాలైపోతున్నారని ప్రజానీకం చెబుతున్నారు.

పెరిగిన ఈవ్ టీజింగ్..

తణుకులో ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల ప్రాంతాల్లో కుర్రకారు బాలికలపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో ఆకతాయిలు బస్సులకోసం వేచిఉండే బాలికలతోపాటు ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులపై అమానుషంగా ప్రవర్తిస్తున్న పరిస్థితులు తణుకులో నెలకొన్నాయి. ముఖ్యంగా బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో చిన్న పిల్లలపై సైతం మైనర్‌లు వాహనాలతో దూసుకువస్తున్నారని, మాయమాటలు చెప్పి చిన్నారులను సైతం బుట్టలో వేసుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పోలీసు అధికారులు ఈ సమస్యలపై దృష్టిసారించి ఈవ్ టీజింగ్‌ను అడ్డుకోవాలని ఆయా ప్రాంతాల్లో సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటుచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీడీపీ నేతల కక్షసాధింపు చర్యలు



ఇల్లిందలపర్రులో టీడీపీ నాయకులు దౌర్జన్యంగా మొదలుకు నరికిన చెట్టు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ నేత ఇంటి ఆవరణలోని వేప చెట్టును కక్షసాధింపు చర్యల్లో భాగంగా టీడీపీ నేతలు మొదలు వరకు నరికేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇరగవరం మండలం కె ఇల్లిందలపర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత పసల రామారావు తాను పంచాయతీ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున పెద్ద ఎత్తున క్యాంపెయిన్ చేయడంతో టీడీపీ నేతలు రెడ్డి దుర్గాప్రసాద్, రెడ్డి కృష్ణచౌదరి, రెడ్డి రామలింగేశ్వరరావు తనను టార్గెట్ చేసుకొని ఈ చర్యకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 20న తాను ఆస్పత్రికి వెళ్లి చికిత్స అనంతరం 25న రాత్రివేళకు ఇంటికి వచ్చేసరికి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని వివరించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదుచేయనున్నట్టు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్



డి.సత్యవతి

తణుకు అర్బన్: రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు అన్ని సివిల్, ఇతర కేసులను వచ్చేనెల 13వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. కేసులు పరిష్కరించుకోవడంద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా సివిల్‌కేసుల పరిష్కారంలో కోర్టుకు చెల్లించిన ఫీజును తిరిగి తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఎక్సైజ్, చెక్ బౌన్స్, బ్యాంకు అప్పు, కుటుంబతగాదా, మోటార్ వాహనాల యాక్సిడెంట్‌వంటి కేసులను ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని వివరించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయటానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు తమ సహాయ సహకారాలను అందజేయాలని కోరారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంపై మీ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టుసిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు.

మత్తు మందుల పట్ల అప్రమత్తంగా ఉండండి



వీకర్స్‌కాలనీలో అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు మందులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు. సొసైటీ, పీర్‌లెడ్ ఇంటర్‌వెన్షన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వీకర్స్‌కాలనీ అరుణోదయ స్కూల్‌లో విద్యార్థులకు మత్తుమందులపై అవగాహన కార్యక్రమం జరిగింది. సైకాలజిస్ట్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లుకు బానిసలు కావొద్దన్నారు. మందు, సిగిరెట్లు వంటివి ఇస్తే తీసుకురమ్మని చెప్పిన తీసుకురావద్దని, ఎవరైన చెడు అలవాట్లు వైపు సరదాగా వెళ్లినా అవి తప్పు అని చెప్పాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువుని కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని వెల్లడించారు. ఎవరైన మత్తు మందులకు అలవాటు పడితే దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ వారి కార్యాలయానికి తప్పక తీసుకురావాలని, అలవాట్లును మాన్పిస్తామని, నయం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నవీన్, కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



ఇఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బషీర్ బాగ్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మామిడి దాన వర ప్రసాద్ పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యమ అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శేషమహల్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దాన వరప్రసాద్ మాట్లాడుతూ పెంచిన ట్రూ ఆఫ్ చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని, ఆనాటి వారి ఆత్మబలిదానాలకు, ప్రతిజ్ఞ దినంగా పాటించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ బాదుడు తగ్గిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. సర్దుబాటు చార్జీలు రూపంలో ప్రజలపై 15 వేల 485 కోట్లు అదనపు భారం వేసిందన్నారు. మరో 21,717 కోట్లు ట్రూ ఆఫ్ చార్జీలు వేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. విద్యుత్ సుంకాన్ని యూనిట్‌కు ఆరు పైసల నుంచి రూపాయికి పెంచుతూ చట్ట బద్దత కల్పించిందన్నారు. స్మార్ట్ మీటర్లతో స్మార్ట్‌గా దోపిడికి చేస్తోందని విమర్శించారు. చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రతిజ్ఞ చేశారు. మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, విజయ్, శ్రీను, భాష, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, యేసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు డీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన లేఖా రచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వసాహితీ వేదిక అధ్యక్షురాలు కొల్లి రమాదేవి, కళాశాల పూర్వపు అధ్యాపకులు కేవీ రామారావులు హాజరైయారు. విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుంకర గోపాలయ్య, పిడతల రామచంద్రుడు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు మోడల్ పాఠశాలలో...

స్థానిక పెంటపాడు మోడల్ ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. పెంటపాడు ఎంఈఓ పీవీ రామకృష్ణ హాజరైయారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించారు. హాకీలో భారత్‌కు వరుసగా మూడు సార్లు బంగారు పతకాన్ని తెచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పెద్దిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



స్కిన్నెరపురం రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: అత్తిలి మండలం స్కిన్నెర పురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గీత దేవి మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పెట్టుబడి తగ్గించే విధంగా వ్యవసాయం చేసుకోవాలన్నారు. మార్టేరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంవి రమేష్ మాట్లాడుతూ రైతులు పంట ఊడ్చిన నెల రోజులకు కూడా కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తున్నారని ఆ విధంగా చేయడం వల్ల భూమి స్వభావం దెబ్బతిని భవిష్యత్తులో దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని తెలియజేశారు. వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ రైతులు ఎరువులు పురుగు మందులు వినియోగాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడులు వైపు దృష్టి సారించాలన్నారు. రైతులకు ఏవైనా సలహాలు సూచనలు కావాలంటే గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు కావలసిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బీవీఆర్ కళాకేంద్రం కళాకారుల ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఎన్‌వీ రమణరావు, పసుపులేటి రామచంద్రరావు, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ, వేమూరి శ్రీనివాస్, లక్ష్మణరాజు, పీటీ వెంకన్న, విజయ్‌కిషోర్, శరత్, ఆకుల ప్రసాద్, ఎర్ర ఆంజనేయ స్వామి, ఏఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ కోసం రైతు నిరసన

తణుకు అర్బన్: గత 60 సంవత్సరాలుగా తన తండ్రి హయాం నుంచి అనుభవిస్తున్న 6.50 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా తణుకు మండపాక గ్రామానికి చెందిన రైతు ముళ్లపూడి శివరామకృష్ణ మండపాక వీఆర్వో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. సర్వే నంబరు 198/1లో తాను సాగుచేసుకుంటున్న భూమిని సర్వేచేసి వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ చేయాల్సిందిగా మండపాక గ్రామంలో 2024 ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతు దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల పిలుపులో భాగంగా 6.50 సెంట్ల భూమిలో 2 సెంట్లకు మాత్రమే దస్తావేజులు ఉన్నాయని మిగిలిన 4.50 సెంట్ల భూమి తాలూకా దస్తావేజులు లేవని తెలిపారు. ఏమైపోయాయో కనిపించడంలేదని రైతు శివరామకృష్ణ తెలిపారు. తన భూమిని తన పేరుమీద ఆన్‌లైన్ చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. అయినప్పటికీ వ్యవహారం ఎటూ తేలకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరసనకు దిగాల్సి వచ్చిందని రైతు శివరామకృష్ణ వాపోయారు.

రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధికి కృషి చేస్తా



అంజిరెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీకి కృష్ణా జిల్లా ఇన్‌చార్జిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి (అంజిరెడ్డి) నియమితులైయారు. సొసైటీ జాతీయ అధ్యక్షుడు వెంగలరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యర్రపు సురేంద్రరెడ్డి ఆదేశాలు మేరకు అంజిరెడ్డి ఈ ఉత్తర్వులు అందుకున్నారు. అంజిరెడ్డి మాట్లాడుతూ తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న రెడ్డి కులస్తుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు అంజిరెడ్డికి అభినందనలు చెప్పారు.

ఆరుగొలనులో బలరామ జయంతి



ఆరుగొలనులో జరిగిన రైతు దినోత్సవంలో మాట్లాడుతున్న సదాశివ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో శుక్రవారం బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద కేంద్ర, కన్యాకుమారి, తెలంగాణా, ఆంధ్రా ప్రముఖ్ బి.సదాశివ మాట్లాడుతూ ద్వాపర యుగంలో రైతులకు ప్రతినిధి బలరాముడని పేర్కొన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ పూర్వాధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు మాట్లాడుతూ రైతులంతా ఒకటైతే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. తాడేపల్లిగూడెం ఫార్మర్ ప్రొడ్యూసర్ సొసైటీ చైర్మన్ కొండపల్లి నగేష్ మాట్లాడారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, ఏడీఏ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీరవెంకట సత్యనారాయణ, పైడికొండల సింధు, రైతులు పాల్గొన్నారు.

ఏకదంతాయ.. బహురూపాయ!



స్థానిక డీఎస్ చెరువు సమీపంలో గణపతి విగ్రహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడలా మండపాల్లో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతుల్లో గణనాయకున్ని కొలువుదీర్చారు. మూడో రోజు శుక్రవారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గణనాథుని ఉత్సవ పందిరలు వద్ద స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

తణుకులో 2 కే రన్



తణుకులో 2కే రన్‌లో విజేతలైన క్రీడాకారులతో అథ్లెటిక్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు 2కె రన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ ఇనస్పెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ బి. జాన్సన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, విద్యార్థులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని ఒలింపిక్స్‌లో పథకం సాధించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారికి ఏఎంసీ మాజీ చైర్మన్ బసవ రామకృష్ణ అల్పాహారం అందజేశారు. విజేతలకు ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ బండారు నరసింహమూర్తి, పద్మావతి దంపతులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి కె. బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయులు కెవీఆర్ సుబ్బారావు, ఎం. నాగరాజ్యం, పి. వల్లి, ఎం విజయదుర్గ, ఎ. నాగేశ్వరావు, కె. వెంకన్న బాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తణుకులో కరపత్రాలు అందిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో ప్రజానీకం పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యనివ్వాలని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని నాగేంద్రనగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పలు చోట్ల కంటైనర్లలో నీటి నిల్వలు, దిగువన రంధ్రములు లేని ఫ్లవర్ పాట్‌లలో లార్వా ట్రేస్ అయ్యిందని, వెంటనే సదరు గృహవాసులతో తొలగింపు చేయించినట్లు చెప్పారు. ఓపెన్ డ్రెయినేజీలపై శాస్వతమార్గంలో రాళ్లను వేయడం వలన చెత్త తొలగించే పరిస్థితులు ఉండడం లేదన్నారు. డ్రెయినేజీల్లో పారవేసే చెత్త దోమలు పుట్టేందుకు మార్గమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఈ వర్షా కాలం ప్రతి రోజూ ఖర్చురహిత డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ జె.శాంత కుమారి, హెల్త్ అసిస్టెంట్ వి.కిశోర్, ఆశా కార్యకర్త పి.మౌనిక పాల్గొన్నారు.

బాలికల చదువు.. ఇంటికి వెలుగు



కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికల చదువు...ఇంటికి వెలుగునిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పీసీపీఎన్‌టీ యాక్ట్, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంపై గర్భిణులు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే మహిళలు తమ పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. గర్భస్థ దశలో లింగ నిర్ధారణ చేయడం నేరమని, అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునే వారికి మొదటి కాన్పునకు రూ.5వేలు, రెండో కాన్పునకు రూ.6వేలు జమ చేస్తారన్నారు. బాలికలకు 18 ఏళ్ల నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుభాషిణి, ఆశా కార్యకర్త ఎం.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ



కొప్పర్రులో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో మంచి ఆదరణ ఉందని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొప్పర్రు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత బావంతో పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కొప్పర్రు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొప్పర్రు గ్రామ శాఖ అధ్యక్షుడిగా రావి బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శులుగా మానుకొండ సామ్యూల్, పుచ్చకాయల సంతోష్‌కుమార్, చెల్లబోయిన పాండురంగ, పాకా వెంకటేశ్వరరావు, ఇంజేటి నాగేశ్వరరావు, కార్యదర్శులుగా చింతపల్లి నరసింహారావు, వడి జయరాజు, పల్లపాటి సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా వలవల శ్రీఏసుబాబు, పోలిశెట్టి సూర్యనారాయణ, తామరాడ పార్వతీశం, మడికి జోసఫ్, ఉప్పు రమేష్, పీతల సంసోను, ఇంజేటి నరసింహారావు ఎన్నుకున్నారు.

క్రీడారంగంలో మహిళలు ముందుకు రావాలి

ఉండి: క్రీడారంగంలో మహిళలు మరింత ముందుకు రావాలని జాతీయ వాలీబాల్ మాజీ ప్లేయర్, జిల్లా గర్ల్స్ వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు గాదిరాజు లోహిత అన్నారు. శుక్రవారం హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 29వ జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో లోహితను సత్కరించారు.